కరెంట్ పోల్‌పైనే ఎలక్ట్రీషియన్ దుర్మరణం

మోతీరాం(ఫైల్)

ఎదులాపురం, జూన్ 9 : ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ విద్యుత్తు స్తంభం పైనే మృతి చెందాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో ఉద్రికత్తతకు దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మోతీరాం (35) కొంతకాలం క్రితం విద్యుత్తు లైన్‌మన్ వద్ద పనిచేసి మానేశాడు. తాజాగా ఆదివారం విద్యుత్తు మరమ్మతుల కోసం స్తంభం ఎక్కాడు. ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా కావడంతో ఆయన స్తంభంపైనే మృతి చెందాడు. మోతీరాం కుటుంబ సభ్యులను ఆదుకోవాలని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు మృతదేహాన్ని కిందికి దింపేది లేదంటూ అక్కడే బైఠాయించారు. దీంతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు మృతదేహం స్తంభం పైనే వేలాడుతూ ఉండిపోయింది. రూరల్ పోలీసులు, విద్యుత్తు అధికారులు గ్రామానికి చేరుకుని సముదాయించడంతో మృతదేహాన్ని కిందికి దింపారు. మోతీరాం భార్య ప్రతిభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. లైన్‌మన్, జూనియర్ లైన్‌మన్‌కు తెలియకుండా మోతీరాం కరెంటు పోల్ ఎక్కి ప్రమాదవశాత్తు మృతిచెందాడని, ఈ ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఆదిలాబాద్ రూరల్ అడిషనల్ అసిస్టెంట్ ఇంజినీర్ తిరుపతిరెడ్డి తెలిపారు.

రేవంత్ స్టిక్కర్ కారులో వన్యప్రాణి మాంసం

- అతివేగంతో బైక్‌ను ఢీకొట్టి..
- అక్కడికక్కడే వ్యక్తి మృతి

భూపాలపల్లి రూరల్, జూన్ 9: భూపాలపల్లి మండలంలోని రాంపూర్ కమలాపూర్ గ్రామాల మధ్యలో ఆదివారం రాత్రి ఇన్నోవా కారు బైక్‌ను ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం నుంచి భూపాలపల్లికి ఇన్నోవా (టీఎస్ 25సి 9999) వాహనం అతివేగంగా వస్తూ బైక్‌ను ఢీ కొట్టడంతో కమలాపూర్ గ్రామానికి చెందిన రేగళ్ల నరేశ్ (33) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా భూపాలపల్లిలోని దవాఖానకు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. కాగా ఇన్నోవా వాహనంపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఉన్నదని, కారు ఢిక్కీలో ఏదో వన్యప్రాణి మాంసం లభించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

వీసీలు హెడ్‌క్వార్టర్స్ దాటి వెళ్లొద్దు

ఏపీ విద్యాశాఖ ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 9 (నమస్తేతెలంగాణ) :ఏపీలో ప్రభుత్వ యూనివర్సిటీల ఉపకులపతులు హెడ్‌క్వార్టర్స్ దాటి వెళ్లొద్దని ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారమే ప్రవేశాలు నిర్వహించాలని ఆదేశించింది. కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టనుండటంతో డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులను రిలీవ్ చేయొద్దని నిర్ణయించిన విషయం తెలిసిందే.

రామోజీకి కడసారి వీడ్కోలు

- అశ్రునయనాలతో రామోజీరావు అంతిమయాత్ర
- ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ఫిలింసిటీలోని స్మృతివనంలో అంతిమ సంస్కారాలు
- రాజకీయ, సినీరంగాల ప్రముఖులు, అభిమానుల నివాళి

ఫిలింసిటీలో రామోజీరావు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు. చిత్రంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

రంగారెడ్డి, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : బహుముఖ ప్రజ్ఞాశాలి, అక్షర సేనాని, రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావుకు అశేష ప్రజానీకం అశ్రునయనాలతో అంతిమవీడ్కోలు పలికింది. ఆదివారం రామోజీ ఫిలింసిటీలోని స్మృతివనంలో ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. శనివారమంతా ప్రజల సందర్శనార్థం రామోజీ ఫిలింసిటీలోని కార్పొరేట్ కార్యాలయంలో ఉంచిన రామోజీరావు భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం ఫిలింసిటీలోని ఆయన నివాసానికి తరలించారు. కడసారి చూసేందుకు రాజకీయ, సినీ, వివిధ రంగాల ప్రముఖులు, అభిమానులు, కవులు, కళాకారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కన్నీటి నివాళులర్పించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర ప్రారంభమైంది. రామోజీ పార్థివదేహాన్ని వైకుంఠరథంపైకి చేర్చే సందర్భంలో కుటుంబసభ్యులు భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. రథంపై రామోజీ కుమారుడు, ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్, కోడళ్లు శైలజా కిరణ్, విజయేశ్వరి, మనవరాళ్లు సహరి, బృహతి, దివిజ, కీర్తి సోహాన, మనవడు సుజయ్, ఇతర కుటుంబసభ్యులు ఉన్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి తదితరులు రథంపై ఉండి స్మృతివనానికి వచ్చారు. అశేష జనవాహిని వెంట రాగా అంతిమయాత్ర ఉదయం 11 గంటలకు స్మృతివనానికి చేరుకుంది.

రామోజీరావు అంతిమయాత్రలో పాల్గొన్న ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, దీవకొండ దామోదర్‌రావు

ప్రముఖుల నివాళి

రామోజీరావు అంత్యక్రియలకు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖులు తరలివచ్చారు. స్మృతివనం వద్ద చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబునాయుడు రామోజీరావు పాడెను మోశారు. దహన సంస్కారాలు పూర్తయ్యేదాకా అక్కడే ఉన్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, బీజేపీ ఎంపీలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, వివిధ పార్టీల నాయకులు నామా నాగేశ్వర్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, నలమోతు భాస్కర్‌రావు, వీ హనుమంతరావు, మోత్కుపల్లి నర్సింహులు, దేవేందర్ గౌడ్, మర్రి శశిధర్‌రెడ్డి, దేవినేని ఉమ, తీగల కృష్ణారెడ్డి, సినీరంగ ప్రముఖులు మురళీమోహన్, సురేశ్‌బాబు, బోయపాటి శ్రీను తదితరులున్నారు.

కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎంపీలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్

కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి

కిషన్‌రెడ్డి క్యాబినెట్.. బండికి సహాయ మంత్రి హోదా

హైదరాబాద్/సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ): కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి రెండు పదవులు దక్కాయి. సికింద్రాబాద్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి మరోసారి కేంద్ర క్యాబినెట్ హోదా దక్కగా, కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్‌కి కేంద్ర సహాయమంత్రి హోదా దక్కింది. రాష్ట్రపతిభవన్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో వీరిద్దరూ మంత్రులుగా ప్రమాణం చేశారు. రాష్ట్ర బీజేపీకి అధ్యక్షులుగా పనిచేసిన ఇద్దరూ ఈ క్యాబినెట్‌లో కేంద్ర మంత్రులు కావడం గమనార్హం. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. రాష్ట్రం నుంచి ఇద్దరికి కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పించినందుకు తెలంగాణ ప్రజల తరపున ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. సిద్ధాంతమే ఊపిరిగా, పార్టీ కోసం పనిచేసిన సాధారణ కార్యకర్తలను గల్లీ నుంచి ఢిల్లీ వరకు తీసుకొచ్చి కేంద్ర మంత్రులుగా తీర్చిదిద్దిన ఘనత బీజేపీదేనని పేర్కొన్నారు.వచ్చే ఐదేండ్లు సంకల్ప పత్రాన్ని అమలు చేసేందుకు, తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం ఉత్సాహంతో, అంకితభావంతో పనిచేస్తామని చెప్పారు.

రాష్ట్రాభివృద్ధికి పనిచేస్తా: బండి సంజయ్

కేంద్ర మంత్రిగా వచ్చిన అవకాశాన్ని రాష్ట్ర ప్రగతితోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం వినియోగిస్తానని బండి సంజయ్ పేర్కొన్నారు. కేంద్రమంత్రిగా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కేంద్ర మంత్రి పదవి దక్కడం చాలా ఆనందంగా ఉన్నదని చెప్పారు. తనపై నమ్మకం వచ్చిన ప్రధాని మోదీకి, పార్టీ జాతీయ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తల కృషి ఫలితంగానే భారీ మెజార్టీ విజయం సాధించానని, కరీంనగర్ ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

కిషన్‌రెడ్డి ప్రస్థానం

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో జన్మించిన కిషన్‌రెడ్డి 1977లో జనతా పార్టీలో చేరారు. 1980లో రంగారెడ్డి జిల్లా బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా, 2004లో యువమోర్చా జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. 2004లో హిమాయత్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009, 2014లో అంబర్‌పేట నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2018లో అంబర్‌పేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్ చేతుల్లో ఓటమిపాలయ్యారు. అనంతరం జరిగిన ఎంపీ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి బరిలో నిలిచి ఎంపీగా గెలుపొందారు. 2021లో జరిగిన క్యాబినెట్ విస్తరణలో తొలిసారి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రిగా నియమితులయ్యారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచి, మరోసారి క్యాబినెట్ హోదా దక్కించుకున్నారు.

ములుగు జిల్లాలో మందు పాతర నిర్వీర్యం

ములుగు, జూన్ 9 (నమస్తేతెలంగాణ): ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండల పరిధిలోని వీరభద్రాపురం గ్రామ అటవీ సమీపంలో సాధారణ పౌరులు తిరిగే ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన నాలుగు మందుపాతరలను గుర్తించినట్టు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ తెలిపారు. అందులో మూడు మందు పాతరలు పేలడంతో ఒక ముళ్లపంది, కొండెంగతోపాటు మరో పెంపుడు కుక్క చనిపోయిందని, వాటి కళేబరాలను గుర్తించినట్టు చెప్పారు. అదే ప్రాంతంలో అమర్చిన మరో మందు పాతరను బీడీ టీమ్ పోలీసులు నిర్వీర్యం చేసినట్టు పేర్కొన్నారు. మావోయిస్టులు మందుపాతర్లను అమర్చడం ద్వారా అమాయక ప్రజల ప్రాణాలతోపాటు వన్యప్రాణులు, పెంపుడు జంతువులు బలవుతున్నాయని తెలిపారు. ఎవరికి ఎలాంటి హానీ జరగకుండా మావోయిస్టులు అటవీ ప్రాంతాల్లో అమర్చిన మందు పాతర్లను వెంటనే తొలగించాలని సూచించారు.

గట్టిగా తుమ్మితే.. పేగులు బయటకొచ్చాయ్!

ఫ్లోరిడా, జూన్ 9: పెద్ద పెట్టున వచ్చిన తుమ్ము.. ఒక వ్యక్తి పేగులు బయటపడేలా తన ప్రతాపాన్ని చూపింది. ఈ అసాధారణ ఘటన అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో చోటుచేసుకుంది. బాధితుడ్ని వెంటనే దవాఖానకు తరలించటంతో, వైద్యులు సర్జరీ నిర్వహించి..అతడ్ని కాపాడగలిగారు. న్యూయార్క్ పోస్ట్ కథనం ప్రకారం, 63 ఏండ్ల ఓ వ్యక్తి తన భార్యతో కలిసి రెస్టారెంట్‌కు వెళ్లగా..హఠాత్తుగా పెద్ద పెట్టున తుమ్ము వచ్చింది. కొద్ది సేపటికి పొత్తి కడుపు భాగమంతా రక్తంతో తడిసిపోయి.. నొప్పితో విలవిల్లాడాడు. అసలేం జరిగిందని భార్య పరిశీలించి చూడగా..అతడి పొట్ట భాగం నుంచి పేగులు బయటకు పొడుచుకుని రావటం కనిపించింది. ఆందోళనకు గురైన ఆమె వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి.. తన భర్తను దవాఖానకు తరలించింది. వైద్యులు సైతం అతని కేసు వివరాలు తెలుసుకొని షాక్‌కు గురయ్యారు. గతంలో అతడికి ఉదరభాగంలో సర్జరీ జరిగిందని, పెద్ద పెట్టున వచ్చిన తుమ్ము లేదా దగ్గుతో ఇలా జరిగి వుండవచ్చునని వైద్యులు అంచనావేశారు.

జమ్ములో ఉగ్రదాడి

మొదటిపేజీ తరువాయి....

పొదలమాటున దాక్కొని ఉగ్రవాదులు ఈ తరహా దాడులు చేస్తుంటారని పోలీసులు చెబుతున్నారు. బస్సులోని ప్రయాణికులంతా ఉత్తరప్రదేశ్‌కు చెందినవారని, అయితే మృతులు ఎవరన్నది ఇంకా గుర్తించలేదని పోలీసులు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు, భద్రతా బలగాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారని, స్థానికుల సాయంతో గాయపడ్డవారిని దవాఖానలకు తరలించామని తెలిపారు.

ఘటనపై ప్రధాని మోదీ సమీక్ష

యాత్రికుల దాడి నేపథ్యంలో ఘటనాస్థలంలోని పరిస్థితిపై ప్రధాని మోదీ జమ్ముకశ్మీర్ ఎల్జీ మనోజ్ సిన్హాతో సమీక్ష నిర్వహించారు. అక్కడి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, బాధితులకు సాయం చేయాలని ఎల్జీని ఆదేశించారు. ఘటనపై తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

ములుగులో మాట్లాడుతున్న ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మురహరి భిక్షపతి.. వరంగల్ జిల్లా నెక్కొండలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్న ఉద్యమకారులు

మాకిచ్చిన మాట నెరవేర్చండి

మొదటిపేజీ తరువాయి...

అల్లి ఉమ, శారద, నెక్కొండ మండల అధ్యక్షుడు కొత్త సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షురాల అనిత, మాజీ సర్పంచ్ మహబూబ్‌పాషా, మాజీ ఉప సర్పంచ్ పరిపాటి ఇంద్రసేనారెడ్డి, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు ఉప్పునూతుల లింగమూర్తి, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి సింగారపు సునీల్‌కుమార్, ఉద్యమకారులు జలగం మోహన్‌రావు, గరిగె రఘు, బైకాని ఓదెలు, గడ్డమీది భాస్కర్, బత్తుల రాణి, మేడుదల వెంకన్న, దర్శనాల సంజీవ, కడారి తిరుపతి, కొండి రమేశ్, బానోత్ గోపి, చందు, కొండా రమేశ్, బండారి సారయ్య, ముడుసు కొమ్మాలు. మెండె నర్సయ్య, గణేశ్, ముత్తయ్య, పోషాలు నేల మల్లమ్మ (వంటల మల్లమ్మ) రవి, మోహిని, స్వరూప, వంగ రజిత, సెండెల్లి లక్ష్మి, లక్ష్మి, బండి సరోజన తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు

మమ్మల్ని ఆదుకోండి

రవీంద్రభారతి, జూన్ 9 : గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. నామినేటెడ్ పోస్టుల్లోనూ ప్రాధాన్యత కల్పించాలని కోరింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల్లో ఒకటైన నిజమైన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఎఫ్ఐఆర్‌తో సంబంధం లేకుండా వెంటనే కేటాయించాలని కోరారు. పథకాల అమలుకు ఎన్నికల కోడ్ ఉందంటూ దాటవేశారని, ఇప్పటికైనా హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డులతోపాటు పింఛన్, ఉచిత బస్‌పాస్, హెల్త్‌కార్డు, వడ్డీలేని రుణాలు ఇవ్వడంతోపాటు సంక్షేమ పథకాల్లో ప్రత్యేక కోటా కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ల సుదర్శన్‌రెడ్డి, వీరస్వామి, బీ ఇంద్రకుమార్, గుండేటి ఐలయ్య యాదవ్, గుర్జని వెంకటేశ్ గౌడ్, ఉండాటి లాలయ్య, దుగ్గని శ్యామల, సదయ్య, ప్రభాకర్, జంగా సుదర్శన్, కే నరేందర్‌గౌడ్, పొంతం యాదిరెడ్డి, కే సురేందర్‌రెడ్డి, దయానంద్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మీడియాతో మాట్లాడుతున్న ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్



వచ్చే 5 రోజులు భారీ వర్షాలు

చురుగ్గా నైరుతి రుతుపవనాలు

హైదరాబాద్, జూన్9 (నమస్తేతెలంగాణ): దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. వచ్చే ఐదు రోజులు పలు రాష్ట్రాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కేంద్ర వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో దక్షిణ మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశాతో పాటు కోస్తా ఆంధ్రలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ శాఖ తెలంగాణకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. దీంతో జీహెచ్ ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం జీహెచ్ఎంసీ పరిధిలో 040-21111111, 9001136675 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. యాదాద్రి-భువనగిరి, మల్కాజ్‌గిరి, ఖమ్మం, మహబూబాబాద్, నారాయణ్‌పేట్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షంతో పాటు గంటకు 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు.

మాజీ సర్పంచ్ సంగమ్మ ఇంట్లో నుంచి బయట పడేసిన గ్యాస్ పొయ్యి, సిలిండర్

బీఆర్ఎస్ నేత ఇంటిపై దౌర్జన్యం

- ఇంట్లోని వస్తువులు బయట విసిరేసి బెదిరింపులు
- నారాయణఖేడ్ మండలం చాప్టా(కే)లో ఘటన
- కాంగ్రెస్ కార్యకర్తలుగా అనుమానం

నారాయణఖేడ్, జూన్ 9: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చాప్టా(కే)లో దుండగులు బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. అర్ధరాత్రి వేళ ఇంట్లోకి చొరబడి వస్తువులను చిందరవందర చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. మాజీ సర్పంచ్ పార్శెట్టి సంగమ్మ భర్త సంగప్ప కథనం ప్రకారం.. చాప్టా(కే)లో శనివారం రాత్రి 11 గంటలకు నలుగురు వ్యక్తులు సంగమ్మ ఇంటిపైకి ఎక్కి లోనికి చొరబడ్డారు. నిద్రిస్తున్న సంగప్పను బెదిరింపులకు గురిచేశారు. 'ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తావా?' అంటూ వీరంగం సృష్టించడంతోపాటు ఇంట్లోని సిలిండర్, టేబుల్‌ను కింద పడేశారు. గది తలుపులు తొలిగించే ప్రయత్నం చేశారు. సంగప్ప గట్టిగా అరుస్తూ వారిపై తిరగబడటంతో పారిపోయారు. ఈ సందర్భంగా సంగప్ప మాట్లాడుతూ.. నలుగురిలో ముగ్గురు ముఖానికి మాస్క్ తొడుక్కొని ఉన్నారని, ఒకరిని మాత్రం గుర్తించినట్టు చెప్పారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సంగప్ప తెలిపారు. ఇది కాంగ్రెస్ కార్యకర్తల పనేనని ఆయన అనుమానిస్తున్నారు.

కారులో నిద్రిస్తుండగా దొంగల దాడి

- 5 తులాల బంగారు ఆభరణాలు చోరీ

జాతీయ రహదారి 65 పక్కన ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ చందనా దీప్తి

చిట్యాల, జూన్ 9 : జాతీయ రహదారి 65 పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్న వారిపై దొంగలు దాడి చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద చోటుచేసుకున్నది. ఎస్సై సైదాబాబు కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా అమలాపురం మండలం తొట్లపాలెం గ్రామానికి చెందిన పల్లెపు శ్రుతి శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు అన్న పంచాక్షరి, వదిన అఖిల, వారి కుమారుడు దేవాంశ్‌తో కలిసి కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. అర్ధరాత్రి దాటిన తరువాత 2.30 గంటల ప్రాంతంలో చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డుపై కారును నిలిపారు. కారు డోర్లను లాక్ చేసుకొని లోపల నిద్రించారు. తెల్లవారుజామున 3.45 గంటల ప్రాంతంలో టీషర్టులు వేసుకొని, ముఖానికి ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు బండరాయితో కారు అద్దాలు పగులగొట్టారు. కారులో నిద్రిస్తున్న శ్రుతి, పంచాక్షరిలను బయటికి లాగారు. వారిని విచక్షణా రహితంగా కొట్టి శ్రుతి మెడలోని తులం గ్రాముల బంగారు గొలుసు, అఖిల మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడు, పంచాక్షరి చేతికి ఉన్న తులం బంగారు ఉంగరాన్ని తీసుకొని పారిపోయారు. శ్రుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్పీ చందనా దీప్తి ఆదివారం ఉదయం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

- సదాశివపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నాగ్సాన్‌పల్లి గేటు వద్ద జాతీయ రహదారి 65పై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు లారీల మధ్య కారు ఇరుక్కుపోయి నుజ్జునుజ్జయింది. కారులో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు ఉండగా మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఇద్దరు పిల్లలు కారులోనే ఇరుక్కుపోగా రెండు గంటలు శ్రమించి బయటకు తీశారు. ట్రాంకర్ డ్రైవర్ మహారాష్ట్రకు చెందిన మృత్యుంజయ (45) అక్కడికక్కడే మృతిచెందాడు. – సదాశివపేట